# ధర్మఛత్రం

ఉక్కపోస్తున్నది. పైన మేఘాలు కదులుతున్నవి గాని వానరాదు. ఈ వారం రోజుల్నుంచీ యిదే తంతు వీక్షిస్తున్నాడు వీరభద్రంగారు. చెప్పుల్లో కాళ్ళు పెట్టటం, చేతికర్రను వూతగా పట్టుకోవటం, పెన్షన్ కోసం బయలుదేరటం, ఆకసం వంక చూసి మళ్ళీ కుర్చీలో కూలబడటం. నిజానికి వుక్కబోస్తున్నది బాహ్యవాతావరణంలో గాదు. తన గుండెలో, తన మనసులో.

మనమరాలు లలిత వచ్చి - 'తాతయ్యా. గొడుగు తెచ్చియ్యనా?" అని ప్రశ్నించింది.

లలిత మాట వినిపించగానే వీరభద్రంగారు రేడియోను టక్కున కట్టేశాడు. ఆ వార్త ఆమె వినగూడని విషాదాగ్ని ఒక్కసారి మేఘాలన్నీ వూగిపోయి నిశ్చలమై పెద్ద వర్షం కురిసినట్లయింది.

రేపు తన మనమరాలు - లలిత గతి గూడా యింతే అయితే? ఒడలు జలదరించి మళ్ళీసర్దుకొన్నాడు.

మొన్న టి.విలోనూ, నేడు రేడియోలోనూ ప్రసారం చేసిన పోచమ్మ ఘోష, అన్నపూర్ణమ్మ ఆక్రందన, వెంకటేశం వేదన - ఎంత అప్రియాలైనా ఎంతటి సత్యనివేదనలు? వాళ్లకన్నబిడ్డలు, ఆడపుట్టక పుట్టినందుకేనా, వరకట్నాలు పూర్తిగా యిచ్చుకోలేక పోయినందునేనా- దుర్మరణాల పాలబడ్డది? ఒకరిది అగ్ని గండం! ఒకరిది జలగండం? ఒకరిది విషగండం!! వాళ్ల పసుపుగుడ్డల రంగు యింకా వెలిసిపోలేదు. వాళ్లనిండు ప్రాణాలు మాత్రం. అత్తమామల ధనదాహం ముందు శాశ్వతంగా మూసుకుపోయాయి.

కాని లోకరీతి ఆగిపోలేదు. కాలం స్థంభించి, ఏమిటీ దారుణం - అని ఆ హంతకుల్ని నిలదీయలేదు. వీరభద్రంగారి గుండెను చిక్కబట్టిన వుక్క అదే.

తాతగారి నుండి ఏ సమాధానమూ రాకపోయినా లలిత, ఆయన చేతికి గొడుగు అందించి, చేతికర్రను తీసుకుపోయింది. వీరభద్రం ఆమెను తదేకంగా చూస్తూనే నిలబడిపోయాడు. ఆమె పాదాలకు పెళ్లి పారాణి కొద్దిమాసాల్లోనే పూస్తారు. కొద్ది మాసాల్లోనే జరీ అంచు తెల్లచీరె మీద పసుపు గుర్తులతో ఒడిబియ్యంతో ఆమె

అత్తవారింటికి పయనమవుతుంది. సంబంధాలు చూస్తున్నారు. కొడుకు వరకట్నం విషయంలో వెనుకంజ వేస్తున్నాడు. అడిగినంత యిచ్చే శక్తి లేదు - మరి.

గొడుగు ఆసరాతో లేచి నిలబడి దాన్ని విప్పబోయి అచంచలుడై నిలబడి పోయాడు. నేను గొడుగు వేసుకొంటే ఏమవుతుంది? ఈ కర్మ భూమిని, పుణ్యనదుల దేశాన్నీ - యిన్ని యుగాలుగా కాపాడి, నీడను, రక్షణను యిచ్చిన ధర్మ ఛత్రమే విరిగిపోయింది గదా. ప్రకృతి ధర్మమైన వివాహ బంధం ఒక వ్యాపార సంధిగా ఎందుకు మారింది! అన్నిటికీ విలువలు మారిపోవచ్చు. కాని ప్రాణపు విలువగూడా పడిపోయిందా? పరమదయాళుడైన బుద్ధుడు, మహాజ్ఞాని అయిన ఆదిశంకరుడు, కర్మవీరుడైన వివేకానందుడు, మానవాత్మకు ప్రతినిధియైన గాంధీ మహాత్ముడు పుట్టి, పెరిగి పావన మొనర్చిన యీ అనాది భూమిలో - ప్రతి మట్టిరేణువూ నిత్యమేదో, అనిత్యమేదో అన్ని యుగాల్లోనూ ఘోషించిన నీతిశాస్త్రాలు ఎందుకు మరుగున పడిపోతున్నాయ్? మన అవినీతిని, అధర్మవర్తనాన్ని, అసురప్రవృత్తిని పాశ్చాత్య నాగరికతా వ్యామోహానికి అంటగట్టడం ఎంతవరకు సబబు? పాశ్చాత్య దేశాల్లో యీ వరకట్నాల మాట మచ్చుకైనా వినబడేదే? వధుహత్యలకు వాళ్లు పాల్పడరే.

ఆలోచనలతో తడిసిపోతూనే వీరభద్రం బ్యాంక్‌దాకా వెళ్లాడు. అక్కడ తటస్థపడ్డాడు సుబ్బారాయుడు, తన చిరకాల స్నేహితుడు. నెలకొకసారైనా దూరం అనుకోకుండా యిద్దరూ ఎక్కడో అక్కడ కలుసుకొని కష్టసుఖాలు వెళ్లబుచ్చుకొంటూనే వుంటారు. సాధారణంగా పెన్షన్ డ్రా చేసుకొనేరోజున భేటీ తప్పదు.

సుబ్బారాయుణ్ణి చూడగానే వీరభద్రానికి తన ఆలోచనలకు, ఆధ్యాత్మిక కల్లోలానికి ఒక ప్రతీక కనిపించినట్లయింది. కొంత ఆవేశం గూడా పూనినట్లయింది. పెద్దగా కుశలప్రశ్నలు నడవకుండానే యిద్దరూ రోడ్డుమీదికి వచ్చారు. వీరభద్రం చిన్న వుపోద్ఘాతంతో తన ప్రశ్నను ప్రారంభించాడు:

"సుబ్బరాయుడూ - నువ్వెప్పుడూ అంటుంటావే "సత్యం బ్రూయాత్, ప్రియాం బ్రూయాత్, నబ్రూయాత్ సత్యమప్రియం " - అని. అంటే సదా సత్యాన్నే పలకాలి. సరళంగానే మాట్లాడాలి - సత్యమైనా యితరులకు బాధాకరమైన విషయాన్ని వుచ్ఛరించవద్దు - అనే గదా అర్థం. ఇవ్వాళ నేను ఆ చివరి సూత్రాన్ని పాటించ దలుచుకో లేదు. నీ మూడో కోడల్ని కాపరానికి తెచ్చే మాట ఏమైనా వున్నదా? వరకట్నం బాకీ వున్నదని ఆ పిల్ల వృద్ధురాలైందాకా వుపేక్షించదలుచుకొన్నావా? నీ వియ్యంకుడు కాలకర్మ వశాత్తు దివాలా తీశాడు - మరి ఆ పిల్ల గతి అంతేనా?"

సుబ్బారాయుడి ముఖం వివర్ణమైపోయింది. కళ్ళల్లో కోపం ఆవరించుకొన్నది. ఏమిటీ అధిక ప్రసంగం. అనుకున్నాడో ఏమో.

"నీకేమన్నా బి.పి. హెచ్చిందా? ఏమిటి నీవనేది? నా కుటుంబ విషయం. నా యిష్టం. ఆ మాట కొస్తే - నీ కొడుకు పెళ్ళికి నువ్వు కట్నం గుంజుకున్నావా లేదా? గురివింద గింజ తన కిందున్న నలుపు ఎరగదంటారు యిందుకేనేమో."

వీరభద్రం ఆవేశం అణిగిపోయింది. నిరుత్తరంగా, కొంచెంసేపు నిశ్చేష్టంగా నిలబడిపోయాడు.

"క్షమించు సుబ్బరాయుడూ. ఏదో ఆవేశంలో అన్నాను. ఎందుకా ఆవేశం వచ్చిందో ఆలోచిస్తే నీమీద ద్వేషంతో కాదు - నీమీది గౌరవంతో. గౌరవం మన స్నేహానికే కాదు. నిన్ను ఎప్పుడూ గురుత్వ ప్రాతిపదికలో పరికించాను. నువ్వు నేర్పిన ఆధ్మాత్మిక అనుభూతిని నేను అనుభవించాను. మానవుడు పూర్ణ జీవితాన్ని కోరుకుంటాడు. పూర్ణ సుఖాన్ని కోరుకుంటాడు. కాని పూర్ణజ్ఞానం కోసం ప్రయత్నించడు - అని బోధించేవాడివి. నీలో గూడా కనిపించిన ఆ లోపం నన్నిట్లా ఆవేశపరిచింది. నిజమే. ఇరవై ఏళ్లకు పూర్వం నా కొడుక్కు పదివేల వరకట్నం గ్రహించాము. కాని నా మనుమరాలు ఎదిగి కూర్చున్నప్పుడు నాకు జ్ఞానోదయం కలిగింది. మొన్న నా జి.పి.ఫండు మొత్తం చేతికందగానే వియ్యంకుడికి క్షమార్పణలతో వడ్డీతో సహా యిచ్చేశాను. ఆయనను వప్పించటం కష్టం అయింది. అయినా ఆ యజ్ఞం ముగిసింది. ఆ కర్తవ్యం ముగించు కొన్నాను. క్షమించు. యిక వస్తాను. "

వీరభద్రం విసవిసా వెనుదిరిగి చూడకుండా నడిచిపోతున్నాడు. వాన చినుకులు తటపట పడ్తున్నవి. గొడుగు విప్పుతూ ఒక్క నిమిషం నడిరోడ్డుమీదే నిలుచుండి పోయాడు. సుబ్బారాయుడి చేతిలో గొడుగులేదు. తడిసిపోతున్నాడేమోనని యింకో నిమిషం గొడుగు విప్పుతున్నట్లు అక్కడే స్థావరమైపోయాడు. ఎంతోసేపు కాకపోయినా చాలా సేపనిపించి, ముందడుగు వేశాడు. వేశాడో లేదో తన గొడుగులోకి ఎవరో మనిషి దూరి భుజంమీద చెయ్యివేసినట్లనిపించి చూచాడు. ఎవరో కాదు, సుబ్బారాయుడే.

"క్షమించాల్సింది నేనుగాదు వీరభద్రం - నీవు. ఇన్నాళ్ళనుంచి నేను పడ్తున్న వ్యధను వెలికి తెచ్చావ్. అందుకు కృతజ్ఞత ,చూపవలసింది పోయి నీతో నిష్ఠూరంగా పలికాను. నిజానికి నీకు ఒక విషయం చెప్పి హృదయభారాన్ని దించివేసుకోవాలనే - ఇక్కడ వేచి చూశాను. నా కోడల్ని యిన్నాళ్ళూ కాపరానికి తీసుకురాంది నేను గాదు. నా భార్య. స్త్రీకి స్త్రీయే శత్రువు అంటారే అదే. పెళ్ళిలో మర్యాదలు జరగలేదని, లాంఛనాలు పొదగలేదని, అన్న మాట నిలబెట్టుకోలేదని పంతాలు పెంచింది. నా

కొడుకు వ్యక్తిత్వం కలవాడే. తల్లి అఘాయిత్యపు, మాటలు - నీకు తెలుసుగా- నుయ్యో గొయ్యో చూసుకోటం లాంటివి- వాణ్ణి కొన్నాళ్ళు మూఢుణ్ణి చేశాయ్. ఏం చేశానో - చెప్పమంటావా? వాడిని వేరే కాపురం పెట్టమని చెప్పాను. పోయిన వారం కోడలు కొత్తయింట్లో పాలు పొంగించింది. నా భార్య రాలేదు. నేనే వెళ్ళి ఆశీర్వదించి వచ్చాను' 'అని చెప్పుకుపోతున్నాడు సుబ్బారాయుడు.

వీరభద్రం కళ్లనుండి జారిపడ్డ ఆనంద ఆవేశభాష్పాలు వర్షపునీళ్లలో కలిసి పోతున్నాయి. మిత్రులిద్దరూ కలిసి కదం వేస్తున్నారు. ఒక చిన్నగొడుగు వాళ్లను వాననుండి కాపాడుతున్నది. ఇటువంటి గొడుగులే కదా మన పూర్వీకులు చేత ధరించింది - అనుకొంటున్నాడు వీరభద్రం.

కట్నం ప్రసక్తి లేకుండా తన మనమరాలి కళ్యాణం జరిగితీరాలి. అట్లాగే అమెరికాలో స్కాలర్‌షిప్ వచ్చి పై చదువులకు పోతున్న మనుమడికీ కట్నం ప్రస్తావన వుండదు. మళ్ళీ లోకంమీద ధర్మఛత్రాన్ని ఎత్తవలసిన వాళ్లు మనుషులే. ఒక్కొక్కవ్యక్తి. అందరూ కలిసి ఒక సమాజం - అనుకొంటున్నాడు - కన్నీళ్ల మధ్య- ఆ జ్ఞానవృద్ధుడు. పోచమ్మ బిడ్డ, అన్నపూర్ణమ్మ కూతురు, వెంకటేశం తనయ - ఆత్మశాంతి పొందుతారని తృప్తి పడ్డాడు. ధర్మాన్ని నువ్వు రక్షించు ధర్మం నిన్ను కాపాడుతుంది.

✿ 1990 లో రేడియోకై రాసిన చిన్నకథ

"మానవేతి హాసానికి మొదటి పంక్తి
మరణవాంగ్మూలానికి చివరి పంక్తి
ఒక శిశువు ప్రథమ శ్వాస
ఒక జనని అంత్య ప్రాస"

(మునిపల్లెరాజు - వేరొక ఆకాశం కావ్యం నుండి)